

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ మారుతిదివాకర్, ఇతర అధికారులు

ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, ఇతర అధికారులు

ప్రజావాణితో..సమస్యల పరిష్కారం

అంబర్‌పేట, జనవరి 8: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణి సోమవారం మళ్లీ ప్రారంభమైంది. గతంలో ప్రతి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలోప్రజావాణిని నిర్వహించేవారు. అన్ని విభాగాల అధికారులు ఇందులో పాల్గొనేవారు. ఏ విభాగానికి సంబంధించి సమస్య వస్తే వెంటనే సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు ఆ ఫిర్యాదును పంపి పరిష్కారానికి చర్యలు చేపట్టేవారు. కానీ కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రజావాణి కార్యక్రమం బంద్ అయింది. మళ్లీ సోమవారం ప్రారంభించారు. అంబర్‌పేట సర్కిల్ కార్యాలయంలో డీసీ మారుతీ దివాకర్ ఆధ్వర్యంలో ప్రారంభం కాగా, ఇందులో ఈఈ పేర్‌రాజు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వీరస్వామి, ఎలక్ట్రికల్ డీఈ వెంకట్రామి రెడ్డి, ఏఎంఓహెచ్ జ్యోతిబాయి, యూసీడీ ప్రాజెక్టు అధికారి రజిత, హార్టికల్చర్ నుంచి భాస్కర్‌లు పాల్గొన్నారు. ఉదయం 10.30 ప్రజావాణి ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. కేవలం రెండు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి.

జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఏసీపీ రమేశ్, అధికారులు

మెహిదీపట్నంలో

ప్రజల సమస్యల పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. జీహెచ్‌ఎంసీ సర్కిల్ -12,13 కార్యాలయాలలో డిప్యూటీ కమిషనర్లు చంద్ర శేఖర్, శశిరేఖల నేతృత్వంలో ఏఎంసీలు, టౌన్‌ప్లానింగ్‌అసిస్టెంట్ కమిషనర్లు ఇతర సిబ్బంది ప్రజల నుంచి వినతి పత్రాలను తీసుకోవడం కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూర్చున్నారు. అయినా రెండు సర్కిళ్లలో ఒక్కఫిర్యాదు కూడా రాలేదని అధికారులు చెప్పారు. ప్రజావాణి కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించకపోవడం వల్ల స్పందన లేదని పలువురు అంటున్నారు.

అబిడ్స్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో

ప్రజావాణితో ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ప్రజలు ఎవరైనా నేరుగా విచ్చేసి సమస్యలు వివరించవచ్చని ఆయన అన్నారు. సోమవారం రోడ్డు సమస్యలపై ఒక ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సయ్యద్ సయీదుద్దీన్, ఏఎంఓహెచ్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ ప్రకాశం పాల్గొన్నారు.

ఖైరతాబాద్ జోన్ జోనల్ కార్యాలయంలో

ప్రజావాణి కార్యక్రమం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రే, ఇతర విభాగాల అధికారులతో అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించాలని నిర్ణయించడంతో ప్రజావాణి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా 8 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 కార్యాలయంలో

జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఏసీపీ రమేశ్ ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణి తొలి రోజు ఒకే ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు.

వివేక్‌నగర్ బస్తీలో శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

వినాయక్ నగర్‌లో శ్రీ రాముడి పూజా అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ పరశురామ్ తదితరులు

కవాడిగూడ, జనవరి 8: కవాడిగూడ డివిజన్‌లోని వివేక్‌నగర్ బస్తీలో బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పరశురామ్ ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య రాముడి పూజా అక్షింతలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ప్రేమ్‌కుమార్, ఈశ్వర్, కిశోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు సిరిమువ్వ కల్చరల్ నాటకోత్సవం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 8: సిరిమువ్వ కల్చరల్ ఆధ్వర్యంలో జనవరి 10న బుధవారం సాయంత్రం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సిరిమువ్వ కల్చరల్ నాటకోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి జి. పెరుమాళ్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాహితీ సూక్తం, హుక్కు నాటికలు ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ రంగస్థల రచయిత గోపి సత్యప్రకాశ్‌కు భజరప్ప రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణకు రావాలని ఆహ్వానం

ఈ నెల 24న నిర్వహించే టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ 2024 డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ని సోమవారం జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ ఉపాధ్యక్షులు ఉమర్‌ఖాన్, కురాడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఖాలేద్‌అహ్మద్, ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, ముస్తఫా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

-సుల్తాన్‌బజార్, జనవరి 8

దేవుని ఎదుట నాటకం

తెలుగు యూనివర్సిటీ, జనవరి8: ప్రముఖ నాటక రచయిత ఆరుద్ర రచించిన దేవుని ఎదుట మాయాజాలం నాటక దర్శకుడు సమ్మెట వెంకటరమణ దర్శకత్వంలో తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సీఏఎమ్మెస్ ఆధ్వర్యంలో పలువురు కళాకారులు ప్రదర్శించి నాటకప్రియుల ప్రశంసలు అందుకున్నారు. ప్రత్యేకమైన రంగస్థల వేదికపై దేవుని ఎదుట అంశంగా న్యాయస్థానం ఆధారంగా ఈ నాటకం సాగింది. అనంతరం కళాకారులను సత్కరించి వారి కళాత్మక ప్రతిభను ప్రశంసించారు.

వారెంట్ రద్దు

నాంపల్లి కోర్టులు, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో బార్యాభర్తలకు వారెంట్ రద్దు చేస్తూ 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నిందితుల తరపున రీకాల్ పిటీషన్‌ను దాఖలు చేసిన న్యాయవాది వాదనలు కోర్టుకు వినిపించారు. ఇప్పటివరకు ప్రతివాయిదాకు సుస్మిత, సాయిలౌకిక్ కోర్టుకు హాజరయ్యారని తెలిపారు. నిందితుడి మేనమామ మరణించిన కారణంగా గత వాయిదాకు మాత్రమే హాజరు కాకపోవడంతో కోర్టు వారెంట్ జారీ చేసిందన్నారు. స్వంత పూచీకత్తుపై ఇద్దరినీ కోర్టు విడుదల చేసింది. ప్రధాన నిందితుడు పులిదిండి ప్రవీణ్ తరపున హైకోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటీషన్ పెండింగ్‌లో ఉంది. మరోవైపు విచారణ ఖైదీగా ఎగ్జామినేషన్ ప్రక్రియను 19వ తేదీన కోర్టు పూర్తి చేయనుంది. అనంతరం సాక్షులకు సమన్లు జారీ చేయనుంది.

మహిళ అదృశ్యం..

నూర్జాహాన్ బేగం

కవాడిగూడ, జనవరి 8: మార్కెట్‌కు వెళ్లి మెహిందీ తీసుకు వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన గాంధీనగర్ పరిధిలో సోమవారం జరిగింది. ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపిన ప్రకారం.. సికింద్రాబాద్ న్యూ బోయిగూడ ఫ్లోరా హోటల్ వెనుక నివాస ముంటున్న నూర్జాహాన్ బేగం(22) ఈ నెల 1 న మెహిందీ తీసుకువస్తానని ఇంట్లో చెప్పి మార్కెట్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో నూర్జాహాన్ బేగం అక్క అమీనా బేగం ఫిర్యాదు చేసింది. నూర్జాహాన్ బేగం ఎత్తు 4 అడుగులు, మెరున్ స్వెట్టర్ ధరించి ఉన్నదని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. వివరాలకు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఏఎస్ఐ ప్రభాకర్ కోరారు.

యువకుడు ఆత్మహత్య

కవాడిగూడ, జనవరి 8: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్ఐ కావ్య తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడ పతంగ్ బిల్డింగ్ వద్ద నివాసముండే కే. మహేశ్(29) టాటా ఏసీ డ్రైవర్. తండ్రి మల్లేశం సెక్యూరిటీ గార్డు, తల్లి ఇండ్లల్లో పాచీ పని చేస్తుంది. కొంత కాలంగా మహేశ్ అప్పుల బాధతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఎవరి పనులకు వారు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహేశ్ 11 గంటలకు ఇంట్లో లోపలి నుంచి గడిపెట్టుకొని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా ఎంతకీ తలుపు తీయకపోవడంతో బలవంతంగా తలుపులు తీసి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

వేరువేరు చోట్ల మూడు మృతదేహాలు లభ్యం

కాచిగూడ, జనవరి 8: అనారోగ్యంతో పుట్‌పాత్‌పై ఓ వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని వీరాపురం గ్రామానికి చెందిన మురళి(45)కాచిగూడ రైల్వేస్టేషన్ రిజర్వేషన్ పుట్‌పాత్‌పై అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్యామ్‌బాబా మందిర్ పుట్‌పాత్‌పై..

కాచిగూడ ఎస్సై పి.రవికుమార్ తెలిపిన ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి(40)కాచిగూడ శ్యామ్‌బాబామందిర్ పుట్‌పాత్‌పై అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై గోధుమ రంగు చొక్క, నీలం రంగు జీన్స్‌పాంట్ ధరించి ఎత్తు 5.7 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8712569149లో సంప్రదించాలి.

వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

అయ్యప్ప పడిపూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జనవరి 8 : గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం నాయకుడు వినయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్, ముఠా జయసింహా, బీజేవైఎం మహంకాళి జిల్లా నగర అధ్యక్షుడు మద్దూరి శివాజి హాజరయ్యారు.

లక్కాకుల ప్రవీణ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో..

అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్ గురుస్వామి

కాచిగూడ, జనవరి 8: లక్కాకుల ప్రవీణ్ కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమం సోమవారం తుల్జాభవన్‌లో వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో పూజ కార్యక్రమంతో ప్రారంభమై ఇరుముడి, మహాపడిపూజ కార్యక్రమంతో ముగిసింది. హరి హరి సుతుడు అయ్యప్పస్వాముల నామస్మరణలతో తుల్జాభవన్ ప్రాంతమంతా భక్తి మయమయింది. ఈ పడిపూజలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, నందగోపాల్, ఉదయ్, జయింతిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, సదానంద్, మహేశ్‌కుమార్, శేషు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

కవాడిగూడ, జనవరి 8: గాంధీనగర్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం సోమవారం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల కొండ కుమారస్వామి, గౌరవాధ్యక్షుడు బర్ల రమేశ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఐత సాయిలు, ప్రధాన కార్యదర్శిగా మంద అనిల్, ఉపాధ్యక్షుడుగా కంతుల యాకయ్య, జాయింట్ సెక్రెటరీగా చిడుమల్ల అనిల్, కోశాధికారిగా రాపాక వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డెక్క రవి(చిన్న), ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా డెక్క రవి(పెద్ద), గాదె కుమార్, కార్యవర్గ సభ్యులుగా మైదం సురేందర్, ఐత ప్రశాంత్, ల్యాదల్ల బాబు, బెగర్ నాగేశ్, ఆరూరి నర్కింగ్‌రావు, చెన్న రాజు, బి. పవన్ ఎన్నికయ్యారు.

సీఎంను కలిసిన సతీశ్ కుమార్ దంపతులు

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సన్మానించిన గోషామహల్ నియోజక వర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు టి. సతీశ్‌కుమార్ దంపతులు.

- అబిడ్స్, జనవరి 8

అశోక్‌కు జేఎన్టీయూ డాక్టరేట్

అంబర్‌పేట, జనవరి 8: జేఎన్టీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నల్గొండ అశోక్‌కు జేఎన్టీయూ డాక్టరేట్ లభించింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన అశోక్ జేఎన్టీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్ ఆధ్వర్యంలో 'ఎఫెక్ట్ ఆఫ్ వేరీడ్ ట్రైనింగ్ డిజైన్స్ ఆన్ జనరల్ మోటార్ ఏబిలిటీ అమంగ్ ఇంటర్ కాలేజీ బాస్కెట్ బాల్ ప్లేయర్స్ ఎట్ హైదరాబాద్' అంశం పై పరిశోధన చేసి నందుకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఇటీవల జరిగిన జేఎన్టీయూ స్నాతకోత్సవంలో ఇస్రో డైరెక్టర్ ఎస్సీ సోమనాథ్, జేఎన్టీయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. తన శిక్షణలో కనీసం ఇద్దరు క్రీడాకారులైన జాతీయ జట్టుకు బాస్కట్‌బాల్‌లో ప్రాతినిధ్యం వహించడానికి కృషి చేస్తానని చెప్పారు.

పదో తరగతి మోడల్ పేపర్‌ల పంపిణీ

మెహిదీపట్నం జనవరి 8: విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్‌లను ఆయన ఎమ్మెల్యేలు కౌసర్‌మొహిసుద్దీన్, మహ్మద్ మాజీద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్ మెరాజ్‌లతో కలిసి అందించారు.

యెట్టం సదానంద్ నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్

విజేతలను అభినందించిన ముజీబ్‌హుస్సేనీ

విజేతగా నిలిచిన క్రికెట్ టీంను అభినందిస్తున్న టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ,కార్యదర్శి ఎస్ విక్రమ్ కుమార్ తదితరులు

సుల్తాన్‌బజార్, జనవరి 8. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తొమ్మిదవ యెట్టం సదానంద్ నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగుతుంది. కాగా ఈ టోర్నమెంట్‌లో పది ఓవర్లకు గాను నిర్వహిస్తున్న మొది క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో సోమవారం గాంధీ దవాఖాన జట్టుపై జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ జట్టు,వాటర్ వర్క్ డిపార్ట్‌మెంట్‌పై హైదరాబాద్ యూత్ ఫోర్స్,క్లాస్ ఫో ర్ట్‌పై వక్ఫ్‌బోర్డు, ఉస్మానియా కళాశాలపై ఆర్టీఏ, డీఈవోపై సీఐఆర్‌ఏ జట్లు విజయం సాధించారని జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విజేతలుగా నిలిచిన టీంలను అభినందించారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి విక్రమ్‌కుమార్, సభ్యులు వైదిక్ శస్త్ర, శ్రీధర్ నాయుడు, ముఖీం ఖురేషీ, మహమ్మద్ వహీద్ తదితరులు పా ల్గొన్నారు.

సంస్కృతి, వారసత్వాల వేడుక

రుక్మిణి కల్యాణ నాట్యప్రదర్శనలో.. కళాకారులు

రవీంద్రభారతి, జనవరి 8: అభినయ వాణి, నృత్యకేతన్-కూచిపూడి నృత్య పాఠశాల వ్యవస్థాపకులు, డైరెక్టర్ గురు చావలి బాలాత్రిపురసుందరి మానస పుత్రిక తన తండ్రి దివంగత పద్మభూషన్ డాక్టర్ వెంపటి చినసత్యం జ్ఞాపకార్థం నాట్యమేధాన్ని రెండు రోజుల పాటు నిర్వహించే వెంపటి నాట్యమేధ, నృత్య రూపకం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ యూనివర్సిటీ డ్యాన్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు తడకమళ్ల అనూరాధ, నాట్యగురువు సంస్థ వ్యవస్థాపకురాలు త్రిపురసుందరి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కూచిపూడి నాట్యప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం పలువురు నాట్యకారిణిలు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో భుజనాగరాయశర్మ, సంగీత స్వరకర్త పి.సంగీత రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు విలీనతేది ఇవ్వాలి

చిక్కడపల్లి, జనవరి 8 : సంక్రాతి కానుకగా ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీన డేట్ ఆఫ్ అపాయింట్మెంట్ ఇవ్వాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతు ముదిరాజ్ మాట్లాడుతూ వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్లను కొనసాగించాలని అన్నారు. నాయకులు డివీకే రావు, పున్న శీనయ్య, రవీందర్, స్వాములయ్య, పీకే మూర్తి, నరేందర్, అతిక్, సంపత్, నాగేంద్ర, బట్టు స్వామి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడుపుతాం

ఎంజీబీఎస్‌లో నిర్వహించిన కో-ఆర్డినేషన్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఏ శ్రీధర్

సుల్తాన్‌బజార్, జనవరి 8: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులను నడుపుతున్నట్లు టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఏ శ్రీధర్ అన్నారు. ఈ మేరకు సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంజీబీఎస్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్, ఇతర సమస్యలు లేకుండా ఉండేందుకు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో కో-ఆర్డినేషన్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీ నగర్ ఏసీపీ నవీన్‌రెడ్డి, సుల్తాన్‌బజార్ ఏసీపీ ఏ చిన్న బాలగంగిరెడ్డి, సౌత్ జోన్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సౌత్ ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణతో పాటు టీఎస్ఆర్టీసీ, కే ఎస్ఆర్టీసీ, కేఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌లో గ్రూప్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

నుమాయిష్‌లోని ఆర్ట్ గ్యాలరీలో ఆర్టిస్టులతో కలిసి గ్రూప్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ తదితరులు

సుల్తాన్‌బజార్, జనవరి 8: కళలకు కాదేది అనర్హమని, చిత్రకారుని కుంచె నుండి జాలువారిన పెయింటింగ్‌లు సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తాయని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్)లోని ఆర్ట్ గ్యాలరీలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రూప్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి చందర్‌జీత్ సింగ్, కోశాధికారి ఈ రాజేందర్‌కుమార్, అశ్విన్ మార్గం, ఆర్ట్ ఎగ్జిబిషన్ కన్వీనర్ డి హనుమంతరావు, ఆర్ట్ సొసైటీ సభ్యులు జే వెంకటేశ్, కాం తారెడ్డి, జి మల్లేశ్, రాజేందర్‌నాగు లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిస్టులు అనంతయ్య, కప్పారి కిషన్, సురభి అజిత, సత్య గన్నోజు, విట్టల్, జి. రమేశ్, ఎ. బాలరాజ్, పి. మహేశ్, పి. రాజేందర్‌కుమార్, అన్నారపు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కార్యవర్గం

హెల్త్ కేర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

సుల్తాన్‌బజార్, జనవరి 8: అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కే వంశీప్రసాద్ అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణ పిట్టల, ఉపాధ్యక్షుడుగా మహమ్మద్ అత్తర్ సలాఉద్దీన్, సంయుక్త కార్యదర్శిగా కే విశ్వనాథ్, కోశాధికారిగా ఏరా వెంకటేశ్‌ముదిరాజ్, కార్యనిర్వహణ కార్యదర్శిగా మానెపల్లి రామన్న, ఎక్కన్న, కార్యవర్గ సభ్యులుగా రాజు, అజయ్, న్యాయ సలహాదారులుగా హైకోర్టు అడ్వకేట్ శ్రావణ్ కుమార్, సలహాదారులుగా డాక్టర్ చెరుకూరి రామ్‌తిలక్, డాక్టర్ రవిశంకర్ ప్రజాపతి ఏ కగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

ఘనంగా ముక్తాబాయి సాల్వే మాంగ్ జయంతి

రవీంద్రభారతి, జనవరి 8: మహిళా రచయిత ముక్తాబాయి సాల్వే మాంగ్ 183వ జయంతి వేడుకలు మాంగ్ సమాజ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి ముక్తాబాయి సాళ్వే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తులసీదాస్ మాంగ్, ప్రొఫెసర్ వాగ్మారే మాయాదేవి, జేమిరాజు, స